## జుక్కల్ అగ్రికల్చర్ ఆఫీసర్ మహేశ్వరి సస్పెన్షన్

### ఎన్ ఫోర్స్ మెంట్ తనిఖీల వివరాలు డీలర్‌లకు లీక్

### కఠిన చర్యలకు వ్యవసాయ శాఖ నిర్ణయం



జుక్కల్, బతుకమ్మ:కామారెడ్డి జిల్లా జుక్కల్ అగ్రికల్చర్ ఆఫీసర్ మహేశ్వరి ని సస్పెండ్ చేస్తు జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జుక్కల్ మండలం వ్యవసాయ అధికారి గా పనిచేస్తున్న మహేశ్వరి స్థానికంగా మండలం లో ప్రైవేట్ ఫర్టిలైజర్స్ నిర్వహకులతో కుమ్మక్కయ్యారనీ ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ తనిఖీల ( ఎన్ ఫోర్స్ మెంట్) వివరాలను ముందే లీక్ చేస్తున్నారని ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. మండలం మహారాష్ట్ర, కర్నాటకకు సరిహద్దులుగా ఉండటంతో నకిలీ విత్తనాలు, పురుగుల మందుల గురించి తనిఖీలు లేవని కూడా కొందరు జిల్లా వ్యవసాయ అధికారి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో శాఖ పరమైన విచారణ చేసి జుక్కల్ ఎఓ మహేశ్వరి ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడినవి ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఎన్ ఫోర్స్ మెంట్ తనిఖీల వివరాలను కొందరు డీలర్లు ఎఓ మహేశ్వరి పోస్టు చేయగా దానిని స్క్రీన్ షార్ట్ తీసి పంపడంతో ఆమే పై వేటుకు కారణమైంది. మహేశ్వరి స్థానంలో పెద్ద కొడప్ గల్ ఎఓ కిషన్ కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

## శరీరంలోని వేడిని తగ్గించడంలో కీరదోస, పుచ్చకాయ.. ఏది ఉత్తమంగా పనిచేస్తుంది..?

వ్యాయామం, ఆహారం ఎంత ముఖ్యమో వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించడం కూడా అంతే అవసరం. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో హీట్ స్ట్రెస్, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శరీరంలోని ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడంలో, వేడి ప్రభావాన్ని తగ్గించడంలో కీరదోసకాయ, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే ఆహారాలు కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే వీటిని సరైన పరిమాణంలో, సరైన సమయంలో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. హీట్ స్ట్రెస్ అంటే శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించలేని పరిస్థితి. ముఖ్యంగా తీవ్రమైన ఎండల్లో ఎక్కువసేపు గడిపినప్పుడు అలసట, తల తిరగడం, అధికంగా చెమటలు పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరానికి నీరు, ఎలక్ట్రోలైట్లను అందించే ఆహారాలు తీసుకోవడం చాలా అవసరం.

పోషకాలు అధికమే..

కీరదోసకాయలో సుమారు 95 శాతం వరకు నీరు ఉంటుంది. అందువల్ల ఇది శరీరానికి క్రమంగా నీటిని అందించడంలో సహాయపడుతుంది. అలాగే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలోని వేడిని తగ్గించడంతోపాటు జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల వేసవిలో రోజువారీ ఆహారంలో కీరదోసకాయను చేర్చడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పుచ్చకాయలో 92 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటాయి. ఇవి శరీరానికి త్వరగా నీటిని అందించడమే కాకుండా వేడి కారణంగా తగ్గిన శక్తిని తిరిగి అందించడంలో, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

## తీవ్ర నీటి కొరతతో అనుక్షణం విద్యార్థుల నరకయాతన

### మూడు, నాలుగు రోజులకొకసారే స్నానాలు

### విద్యార్థుల అవస్థలపై ప్రత్యేక దృష్టి సారించని పై అధికారులు

### ఏకలవ్య పాఠశాలలో నెలకొన్న దుస్థితి

ఇందల్వాయి, బతుకమ్మఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నీటి కొరత తీవ్ర రూపం దాల్చింది. నిత్యం వందలాది మంది విద్యార్థులు ఉండే ఈ వసతి గృహంలో కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. విద్యార్థులు స్నానం చేయడానికి నీరు దొరకని పరిస్థితి నెలకొందని విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు ఉదయం 5:30 గంటలకే నిద్ర లేస్తున్నప్పటికీ, బాత్రూమ్‌లలో నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి ఎద్దడి కారణంగా విద్యార్థులు మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే స్నానం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 40 వేల లీటర్లు వస్తున్నా సరిపోవడం లేదని విద్యార్థులు తెలుపుతున్నారు. పాఠశాలకు మిషన్ భగీరథ ద్వారా రోజుకు






దాదాపు 40 వేల లీటర్ల నీరు సరఫరా అవుతున్నప్పటికీ, అది ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. పాఠశాల ప్రాంగణంలో ప్రస్తుతం నూతనంగా కొన్ని నిర్మాణ పనులు జరుగుతున్నాయి. క్యూరింగ్ పేరిట వృథా చేస్తున్నారని తెలిపారు. ఈ నిర్మాణాలకు వాటర్ క్యూరింగ్ (తడుపడం) కోసం కూడా మిషన్ భగీరథ తాగునీటినే వాడుతుండటంతో విద్యార్థులకు నీటి కొరత మరింత తీవ్రమైంది. విద్యార్థులు మాట్లాడుతూ మాకు త్రాగడానికి, స్నానాలకు నీరు సరిపోవడం లేదన్నారు. అలాంటిది భగీరథ నీటితో నూతన నిర్మాణాలకు క్యూరింగ్ ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులు ఉన్నారనే భావన లేకుండా తమకు చుక్క నీరు కూడా దొరకకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు,విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి ఏకలవ్య పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థులకు ఇచ్చే నీటిని నిర్మాణ పనులకు వాడకుండా చూడాలని కోరుతున్నారు. విద్యార్థుల అవసరాలకు మాత్రమే నీటిని వాడుకునేటట్లు చూడాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## గాంధీ చౌక్ సమీపంలో కారు చోరీ కేసు ఛేదించిన టౌన్ -I పోలీసులు

### నిందితుడు అరెస్ట్, కారు స్వాధీనం

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :గాంధీ చౌక్ సమీపంలో ఇటీవల జరిగిన కారు చోరీ కేసును టౌన్-I పోలీసులు వేగవంతమైన దర్యాప్తుతో ఛేదించారు. ఈ కేసులో ఒక నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి చోరీకి గురైన కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, బాధితుడు తన కారులో రైల్వే స్టేషన్ నుంచి గాంధీ చౌక్ వైపు ప్రయాణిస్తుండగా, మార్గమధ్యంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రయాణికుడిగా కారులో ఎక్కి తనను ఒక ప్రాంతానికి తీసుకెళ్లాలని కోరాడు. అనంతరం గాంధీ చౌక్ సమీపానికి చేరుకున్న తర్వాత పండ్లు కొనుగోలు చేయాల్సి ఉందని చెప్పి డ్రైవర్‌ను కారులో నుంచి దిగి పండ్లు తీసుకురావాలని నమ్మించాడు. డ్రైవర్ పండ్లు కొనుగోలు చేయడానికి వెళ్లిన అవకాశాన్ని ఆసరాగా చేసుకున్న ఆ వ్యక్తి కారును అపహరించి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టౌన్--× పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన కారును స్వాధీనం చేసుకుని, ఈ కేసుకు సంబంధించిన వాహనమేనని నిర్ధారించారు. అరెస్టు చేసిన నిందితుడిని లఖ్వీందర్ సింగ్ (30) గా పోలీసులు గుర్తించారు. అతను పంజాబ్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ ప్రాంతానికి చెందిన హర్బన్స్ సింగ్ కుమారుడు. నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు అతడిని జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులను సులభంగా నమ్మవద్దని, ప్రయాణాల సమయంలో తెలియని వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వాహనాలను నిర్లక్ష్యంగా వదిలివేయకుండా, నాణ్యమైన భద్రతా తాళాలు, భద్రతా పరికరాలు వినియోగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర పోలీస్ సేవలకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్తి సంబంధిత




నేరాలను అరికట్టేందుకు పహారా, నిఘా, ప్రత్యేక దర్యాప్తు చర్యలను మరింత బలోపేతం చేస్తున్నట్లు టౌన్--× పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓ బి. రఘుపతి తెలిపారు.

# మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

ఆదిలాబాద్, బతుకమ్మ :తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొత్తం రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించిన మైనార్టీ గురుకుల బాలుర-2 విద్యాలయం, జూనియర్ కాలేజ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలను శనివారం మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో మైనార్టీ గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. గతంలో విద్యా అవకాశాలకు దూరంగా ఉన్న మైనార్టీ విద్యార్థులకు ప్రస్తుతం ఆధునిక సౌకర్యాలతో కూడిన గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, ఉచిత విద్య, భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు వంటి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు.





విద్యే సమాజ అభివృద్ధికి ప్రధాన ఆధారమని, మైనార్టీ యువత ఉన్నత చదువులు పూర్తి చేసి వైద్యులు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని షబ్బీర్ తెలిపారు. విద్యతో పాటు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి మైనార్టీ కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, మహమ్మద్ అజారుద్దీన్, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ అధ్యక్షులు ఫహీమ్ ఖురేషి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీ ఉల్లా ఖాన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యేలు వెడ్మా బొజ్జు, పాయల్ శంకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.